
# ప్రమాదం



కనకరాజుతో అనుబంధం తెగిపోయింది. ఎలా తెగిపోయిందని నన్నడగకండి. ఈ సమాజంలో నాలా ఆత్మన్యూనతతో బాధపడే వారికంటే, అడ్డమైన 'ఇగో'లతో ఇతరుల్ని ఇబ్బందిపెట్టేవాళ్ళే ఎక్కువని నా నమ్మకం. ఉత్త నమ్మకమే కాదు దృఢ విశ్వాసం.

మగవాణ్ణనే 'ఇగో' మొదట్నుంచీ ఉన్నదే. డబ్బూ, అందం, హోదా ఇవన్నీ 'ఇగో'ల మూలస్తంభాలే. అది భరించలేకనే వాటి చుట్టాలకు దూరంగా ఉండటం నాకు అనాదిగా అలవాటైంది. వీటికి తోడు బండ్లు తోలేవాళ్ళూ కళ్ళు నెత్తికెక్కించుకొని తిరగడం నన్ను చాలా బాధపెడ్తూంది. ఒకటా, రెండా? లెక్కకు మించిన ఉదాహరణలు......

అరె, కనకరాజెవడండి ? ఆ ! స్వయానా నా క్లాస్‌మేట్. మొన్న మొన్నటిదాకా విరిగిన మధ్యతరగతి నిచ్చెన మీద పైకెక్కలేక, కిందికి దిగలేక అవస్థ పడుతున్నవాడే, నాలా బెల్లూ, బ్రేకులూ లేని సైకిల్ మీద తిరుగుతూ 50 మీటర్ల దూరాన కనిపించగానే 'హలో' అంటే 'పాలో' అంటూ జైజై (బైబై) చెప్పినవాడు. వెధవ ! అలాంటి వెధవ బండి కొన్నఆర్నెల్లకే ఎంతగా మారిపోయాడు. ?!!

కొత్తగా బండి తీసుకున్నాడన్న విషయం తెలిసి పలకరిద్దామని వాళ్ళింటికెళ్తుంటే దారిలోనే వీధి మలుపు వద్ద కనించాడు. 'హలో !' అంటూ మొహమంతా ఆనందంతో కేకేస్తే అంతకు మించిన వేగంతో నా కళ్ళల్లో దుమ్ము కొట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

నేన్నమ్మలేకపోయాను ఏదో అర్జెంట్ పనిగాబోలనుకున్నా.

మరోసారి వెనకెవ్వరో లేడీని కూచోబెట్టుకొని వెళ్తున్నాడు. దూరాన్నుండే గమనించిన నేను సైకిలాపేసి నిలుచున్నా. "అసలు కథేంటో" తెలుసుకుందామని. వెధవ నాకు పలకరించే అవకాశం కూడా ఇవ్వకుండా నా మొహం చూడకుండానే వెళ్ళిపోయాడే. దీనికేమనాలి ?

ఇవన్నీ వదిలేయండి. సైకిలు మొరాయించడంతో కాలినడకనే ఆఫీసు కెళ్తున్నాను.

వాడు స్కూల్లో టీచరుగా వెలగబెడ్తున్నాడు. రోజూ మా ఆఫీసు ముందునుండే ఆ ఊరికెళ్తాడు. ఆరోజు కూడా వెళ్తున్నాడు. రోడ్డుమీద రద్దీ ఏ మాత్రం లేదు. టైమయ్యింది కదా అని ఇటువంటి సమయంలోనే దరిద్రం ముండ (సైకిల్) ఇబ్బంది పెడ్తుందని మనసులోనే చడామడా తిట్టుకుంటూ, భుక్తాయాసానికెదురీత్తో, అవస్థపడ్తూ వెళ్తున్నాను. అప్పుడా వెధవ నా వెనకనుండి వచ్చి ముందుకు దూసుకొని వెళ్ళాడు. ఇరవై గజాలు ముందుకెళ్ళాక చూశా. పలకరించేంత టైం లేకపోయింది. నేను సరే, చూళ్ళేదు వాడైతే నన్ను చూశాడు గదా. అరే, స్నేహితుడనే వాడు అవస్థ పడుతున్నాడని గ్రహించి సాయం చేయనక్కర్లేదా ? నేనెంత గాయపడి ఉంటానో చెప్పండి.

అందుకే కారణాలడుగ దలచుకోలేదు. వాడితో అన్ని అనుబంధాలూ తెంచుకున్నాను. ఈ విషయం ఇంతకు మునుపు మా ఇద్దరితోనూ పరిచయమున్న మిత్రుల్తో చెప్పేశాను. పోనీ చెప్పగానేనైనా కనీసం పలకరించొచ్చు గదా ! అదీలేదు. కాగా ఈ ఉదయం వాళ్ళ పన్నెండేళ్ళ 'సాయికుమార్'ని పంపించి 'ఇంటికి రమ్మంటూ' కబురు చేశాడు. గాయాల ఒంటికి కారం పూసుకున్నట్లైంది నాకు.

'నేను రా'నని చెప్పమన్నాను. అంతటితో ఊరుకోలేదు. "ఇంకెప్పుడూ మీరు కూడా ఈ గుమ్మం తొక్కనక్కర్లేదు. పాముపగ-తోకచుట్టం కాదు. వాడికివ్వాల్సిన రెండువేల రూపాయలు కూడా ఈ ఫస్టుకి వాని మొహాన పారేస్తానని చెప్పు" అంటూ కేకలేశాను. వాడు కళ్ళనీళ్ళ పర్యంతమై వెళ్ళిపోయాడు. అప్పుడుగానీ కుదుట పళ్ళేదు నా మనసు.

❄ ❄ ❄

"ఏవండీ ! కనకరాజన్నయ్యకు యాక్సిడెంటైందట. వెళ్ళి చూసొద్దాం పదండి !" ఆఫీసునుండి ఇంట్లో కాలు పెట్టగానే, ఆ క్షణంకోసమే ఎదురు చూస్తున్నట్టు మా ఆవిడ సుశీల ఆదుర్దాగా అంది.

యాక్సిడెంటనగానే కలుక్కుమంది. వెళ్ళి చూసొద్దా మనిపించింది. అంతలోనే చేసిన ప్రతిజ్ఞ గుర్తుకొచ్చింది. మౌనంగా బెడ్రూంలో కెళ్ళి బట్టలు మార్చుకోసాగాను.

"అబ్బ, బట్టలు మార్చుకోవడమెందుకండీ, తొందరగా వెళ్దాం పదండీ దెబ్బలు చాలా తగిలాయట. 'అనంత్ హాస్పిటల్'లో చేర్పించారట. ముందు చూసొద్దాం పదండీ' తొందరపెట్టింది. ఆవిడ మాటల్లో అభ్యర్థన, ఆజ్ఞ కలగలిసున్నాయి. అనారోగ్యంగా ఉండి మందులేసుకోనప్పుడు నన్ను మందలించే మందలింపది.

"వెళ్ళడమా, మానటమా" అని ఒక్కక్షణం ఆలోచించాను. వెళ్ళాలనే అనిపిస్తుంది వాడి పరిస్థితి తలచుకుంటే. కాని మొండితనం ముందుకొస్తుంది. మా ఆవిడ బతిమాలు తుంటే మూర్ఖత్వమే గెలిచింది. అది రాచరికం కంటే బలమైంది కదా ! ఏమీ పట్టనట్టు లుంగీ కట్టుకొని బాత్రూంలో దూరాను.

"ఏం స్నేహితులండీ ! ప్రాణాపాయంలో ఉన్నవాణ్ణి చూడ్డానికూడా అనవసరమైన మాట పట్టింపుల్తో ..." మా అవిడ ఉపన్యాస ధోరణి నాకు నచ్చలేదు.

"షటప్ !" గట్టిగా అరిచా బాత్రూంలో నుండి బయటికొస్తూ అప్పటికే ఓ నిర్ణయానికొచ్చేశాన్నేను. చెప్పకుండా చేయటం నాకో అలవాటు. బిక్కచచ్చిపోయి. నా మొహంలోకి చూస్తుంది సుశీల సాధారణంగా అలా నేనరవటమనేది జరుగదు.

"ఉపన్యాసలివ్వకు. మనం బయల్దేరుతున్నాం. ఆటోని పిలువ్" ఉరుము వెంట వర్షంలా చెప్పేశాను. క్షణంలో తేరుకొని, ఆటోని పిలిచేందుకు బయటికెళ్ళింది.

❋ ❋ ❋

"మధూ ! నిన్ను చూస్తుంటే సగం బాధ తీరిపోయినట్టుందిరా ! తలకు, కాళ్ళకూ కట్టిన బ్యాండేజీలను లెక్కచేయకుండా వాడు మాట్లాడుతుంటే నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

వాళ్లావిడ పక్కకు తిరిగి కళ్ళు వత్తుకుంది.

"బంగారూ ! కనకరాజుని 'బంగార్రాజు' అని పిలవటం నా కలవాటు. అలా 'బంగారు' వాడికి స్థిరమైపోయింది.

"ఇప్పుడేం మాట్లాడకురా ! అన్నీ తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం ! యు టేక్ రెస్ట్" అంటూ వాడి బుగ్గను తట్టాను ఆప్యాయంగా.

రెండు చేతుల్తో నా చేతిని గట్టిగా పట్టుకున్నాడు వాడు.

"నో ! మధూ ! నన్ను మాట్లాడనీయరా ! ఇప్పుడు నా ప్రాణానికొచ్చిన ముప్పేంలేదు. ఇప్పుడు మాట్లాడితే గాని, నా మనసు గాయం చల్లారదు." వాడింత భారీ డైలాగులు వాడటం నాకు గుర్తులేదు. అయితే నిజంగానే చాలా బాధపడి ఉంటాడు. నేను మాత్రం తక్కువ పడ్డానా !

"నాకు తెల్సులేరా ! ఇప్పుడు మాత్రం మాట్లాడక !" అంటూ "ఇంతకూ యాక్సిడెంటెలా జరిగింది ?" మాట మార్చాను.

"అదే చెప్తా ! కాస్త సిగరెట్ అంటించివ్వు" ఆశ్చర్యంగా చూస్తున్న నా వైపు రిలాక్స్‌డ్‌గా చూస్తూ మోచేతుల బలంతో, నేను సాయం చేయబోతున్నా పటించుకోకుండా దిండును కాట్‌రెస్ట్‌కి ఆనించి కూర్చున్నాడు అలాగే.

అంటించిన 'పొగరాక్షసి' (అదంటే నాకు పడదు మరి)ని అపురూపంగా ముద్దాడుతూ, ఆస్వాదిస్తూ మెల్లగా చెప్పసాగాడు.

"మా సాయితో నువ్వు అన్న మాటలు నన్నెంతో కలవర పెట్టాయిరా..."

అడ్డుకోబోతున్న నన్ను చేతిసైగతో వారిస్తూ చెప్పుకు పోసాగాడు.

"నువ్వు కార్తీక్‌తో, రాజేష్‌తో అన్న మాటలు నన్ను బాధపెట్టాయి. అందుకే మా అబ్బాయిని నీవద్దకు పంపించా, అన్ని సంగతులూ, అనుభవాలు చెప్పాలని. కాని, అదే నేను చేసిన పెద్ద పొరపాటైంది."

పక్కనే మా ఆవిడ కోసం చూశా వింటుందేమోనని. ఆడాళ్ళిద్దరూ ఎప్పుడో వాళ్ళలోకం (మాటలు)లో లీనమైపోయినట్టున్నారు. పక్కనే కొద్దిదూరంలో ఖాళీగా ఉన్న బెడ్ మీద జన్మ జన్మల మాటలన్నీ ఏకరువు పెట్టుకుంటున్నారు.

"నేను నీతో చెప్పాలనుకున్న విషయానికి ద్వారాలన్నీ మూసేశావ్."

"నీవనుకున్నట్లు నేను నిన్నెప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. నువ్వే నాకు దూరమవుతున్నావు. బండి తెచ్చిన కొత్తలో బ్లాక్ గ్రౌండ్స్‌లో డ్రైవింగ్ చేద్దా"మంటే 'నాకెందు'కంటూ తిరస్కరించావ్. అవసరానికి నన్నెప్పుడైనా సరే వినియోగించు కోవచ్చుని చెబితే 'అలాగే చూద్దా'మంటూ ఉపేక్షించావ్.

"ఆ తర్వాత నువ్వు కనిపించిన ప్రతిసారీ ఏదో ఒక తొందర ఉండటం మూలాన నిన్ను పలకరించలేక పోయాను."

"మామూలుగా కాలినడకనో, సైకిల్‌పైనో వెళ్ళేటప్పుడు సావకాశంగా వెళ్ళేవాళ్ళం. బండి వచ్చిన్నాటినుండి, సరిగ్గా టైముకో, కాస్త ఆలస్యంగానో బయలుదేరటం పరిపాటైంది.

"అదిగాక డ్రైవింగ్‌లో.....అందులోనూ కొత్తగా డ్రైవింగ్ చేసేటప్పుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదమే. బండి మన చేతిలో, ప్రాణాలు దాని చేతిలోనూ ఉన్న ఫీలింగ్‌తో అసలెవ్వర్నీ పలకరించే అవకాశముండేది కాదు. ఇంకా పసివాళ్ళు సర్రున దూసుకురావడాలు, దిక్కులు చూస్తూ నడిచేవాళ్ళు, నాలా కొత్తగా రోడ్లెక్కిన వాళ్ళు ఇది చాలదన్నట్లు బాగా అలంకరించుకున్న అందమైన అమ్మాయిలు, అడపా దడపా వ్రతభంగం చేస్తూ ఉంటే అష్టావధానం కన్నా కష్టమైందిరా బాబూ ఈ బండితోలటం.

"నువ్వు నాకు షాక్ ఇచ్చిం తర్వాత కాస్త కళ్ళు తెరిచి అందరినీ పరిశీలించే దశకొచ్చాను. చిన్ననాటి క్లాస్‌మేట్ శ్రీకాంత్ కనిపించాడు. వాడు నన్ను చూళ్ళేదు నేనే వాణ్ణి గుర్తుపట్టాను. ట్రాన్స్‌కో వాళ్ళ నిర్వాకానికి వానదేవుడు తోడుకావడంతో బండి నిర్దాక్షిణ్యంగా నన్నీ స్థితిలోకి నెట్టేసింది. ఈ సంగతింకా శ్రీకాంత్‌గాడు గమనించనే లేదనుకో..."

వాడు సరదాగా చెబుతున్నా.... ఆ మాటల వెనకున్న ఆవేదన నన్ను కదిలించింది.

'ఇగో' కన్నా ఆత్మన్యూనతే ప్రమాదకరమైందన్న సంగతి ఇప్పుడిప్పుడే తెలుస్తూంది.

సెప్టెంబర్, 2000 – 'మూసీ'
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక